
సాక్షి
ఒడిశా

శనివారం, 9, డిసెంబర్, 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,48,695లు బంగారం 2 గ్రాముల 750 మిల్లీ గ్రాములు, వెండి 74 గ్రాములు 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



లిక్కర్ అక్రమాలతో బీజేడీకి సంబంధాలు 8లో

రాష్ట్రంలోని లిక్కర్ అక్రమార్కులతో అధికార పక్షం బిజూ జనతా దళ్‌కు సంబంధాలు ఉన్నట్లు విపక్ష భారతీయ జనతా పార్టీ ఆరోపణలు చేస్తోంది.



బాక్సైట్ తవ్వకాలపై అభ్యంతరం లేదు 8లో

రాయగడ జిల్లాలో కాసీపూర్ సమితిలోని సిజిమాలిలో బాక్సైట్ తవ్వకాలకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని బాధిత గ్రామస్తులు స్పష్టం చేశారు.

న్యూస్‌రీల్

కుందేలును వేటాడిన ఇద్దరు అరెస్టు



అరెస్టు చేసిన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

రాయగడ: కుందేలును వేటాడిన కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన ఘటన జిల్లాలోని గుడారి సమితిలో చోటుచేసుకుంది. శుక్రవారం జరిగిన ఈ ఘటనలో అరెస్టైనవారిలో గుడారి సమితి గోపాలపూర్ గ్రామానికి చెందిన సురేష్ కై వర్తి (27), పూర్ణ కద్రక (45)లు ఉన్నట్లు ఫారెస్టర్ శివరాం ప్రధాన్ తెలియజేశారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో సురేష్, పూర్ణలు ఒక కుందేలును వేటాడి తీసుకొస్తున్నారు. ఇది గమనించిన అటవీ సిబ్బంది ఇద్దరినీ అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 3 కిలోల బరువు గల మృతి చెందిన కుందేలుతో పాటు, వేటాడేందుకు వినియోగించిన నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన అగ్నిమాపక దళం



యువకుడిని రక్షిస్తున్న అగ్నిమాపక దళ సిబ్బంది

భువనేశ్వర్: మహానదిలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించిన యువకుడిని అగ్నిమాపక దళ సిబ్బంది శుక్రవారం రక్షించారు. వివరాల్లోకి వెళ్తే.. నగర శివారు పాత్రపాడాలో నివాసముంటున్న షేక్ జహంగీర్ గురువారం రాత్రి తల్లిదండ్రులతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం వంతెనపై ద్విచక్ర వాహనాన్ని నిలిపి నదిలోకి దూకాడు. ఇంతటితో కథ ముగిసిపోతుందని భావించిన ఆయన ప్రాణాలు నిలిచిపోయాయి. నదిలో పడాల్సిన యువకుడు వంతెన స్తంభంపై చిక్కుకున్నాడు. శుక్రవారం ఉదయం స్థానికులు అతడిని గమనించి అగ్నిమాపక దళం, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వీరు ఘటనా స్థలానికి చేరుకొని సుమారు గంట పాటు శ్రమించి యువకుడిని రక్షించారు.

అడవి పంది దాడిలో ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న పిడికాక

రాయగడ: అడవి పంది దాడిలో ఒక వ్యక్తి తీవ్రగాయాలకు గురయ్యాడు. జిల్లాలోని గుడారి సమితి మధుబన్ అడవుల్లో చోటుచేసుకున్న ఘటనలో గాయాలు పాలైన వ్యక్తి జిమ్మారావు గ్రామానికి చెందిన మేటా పిడికాక (54)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. ఎప్పటిలాగే పిడికాక శుక్రవారం తెల్లవారుజామున కట్టెలు తీసుకొచ్చేందుకు సమీపంలోని అడవులకు వెళ్లాడు. అక్కడ నుంచి కట్టెలు తీసుకొస్తున్న సమయంలో ఒక అడవి పంది అతనిపై దాడి చేసింది. ఈ దాడిలో తీవ్రగాయాలకు గురైన పిడికాకను గ్రామస్తులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలియజేశారు.

నిధులు వినియోగిస్తేనే అభివృద్ధి



మాట్లాడుతున్న మంత్రి అతున్ సవ్యసాచి వేదికపై మంత్రి సరక, కలెక్టర్ సింగ్

- రోడ్ల నిర్మాణాలకు చర్యలు
- మంత్రి అతున్ సవ్యసాచి
- డీపీసీ సమీక్ష సమావేశంలో అధికారులపై మండిపాటు

రాయగడ: జిల్లాల్లో వివిధ పనులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సకాలంలో వినియోగిస్తేనే అభివృద్ధి సాధ్యమని జిల్లా ప్రణాళికా మండలి చైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాలు, సంక్షేమ శాఖ మంత్రి అతున్ సవ్యసాచి నాయక్ అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా ప్రణాళిక మండలి (డీపీసీ) సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల కింద మంజూరవుతున్న నిధులు ఖర్చు చేయకపోవడంతో అధికారులపై మండిపడ్డారు. జిల్లా సమగ్రాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ద్వారా 2023లో ఎన్ని నిధులు మంజూరయ్యాయి, ఎన్ని పనులు చేశారని ఆ సంస్థ అధికారిని ప్రశ్నించారు.

ఇతర పనులకు మళ్లించాలి

జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి మంజూరవుతున్న నిధులు సకాలంలో వినియోగించడంతో పాటు మిగులు నిధులను ఇతర అభివృద్ధి పనులకు మళ్లించాలని మంత్రి అతున్ కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్‌కు ఆదేశించారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి కలెక్టర్ సమీక్షను నిర్వహించి ఆయా శాఖల పనితీరును పరిశీలించాలన్నారు. మజ్జిగౌరి మందిరం సమీపంలో జంఝావతి నదిపై సుమారు రూ.19 కోట్లతో నిర్మిస్తున్న వంతెన పనులు సకాంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో అమలవుతున్న మెగా వాటర్ ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. రాయగడకు సమీపంలోని బాకురుగుడలో నిర్మిస్తున్న ప్లానిటోరియం పనులు దాదాపు పూర్తయ్యాయని, త్వరలో ముఖ్యమంత్రి దీనిని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని వివరించారు.

తుఫాన్ నష్టం నివేదిక ఇవ్వండి

మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో ఏర్పడిన నష్టం అంచనా నివేదికను ప్రభుత్వానికి రెండు రోజుల్లో అందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాల్లో తుఫాన్ ప్రభావం అంతంతమాత్రంగానే ఉందని, కేవలం 15 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైందని కలెక్టర్ సింగ్ వివరించారు. చంద్రపూర్, కల్యాణ సింగుపూర్, పద్మపూర్, రామనగుడ, మునిగుడ ప్రాంతాల్లో కొంత వరకు తుఫాన్ ప్రభావం చూపించినప్పటికీ ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం సంభవించలేదని వివరించారు. కొన్ని సమితుల్లో వర్షాల కారణంగా వరి, పత్తి పంటలు తడిచిపోయాయని, వాటి అంచనాల సమగ్ర నివేదిక కోసం ఒక బృందం ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తోందని వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు, సమితి అధ్యక్షులు, సర్పంచులు, జిల్లా పరిషత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు రూ.52 కోట్లు మంజూరు

జిల్లాలోని కాసీపూర్ సమితిలో వివిధ గ్రామీణ ప్రాంతాలకు సరైన రహదారులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో సమితిలో రహదారులు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.52 కోట్లు మంజూరు చేసిందని మంత్రి అతున్ తెలియజేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో భూమిపూజలు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అదేవిధంగా కాలువలపై చిన్న చిన్న వంతెనల కోసం, అప్రోచ్ రోడ్డులను నిర్మించేందుకు మరో రూ.85 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు.



సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

● లక్ష తులసీ దళార్చన



స్థానిక బ్రాహ్మణ వీధి సమీపంలోని కోదండరామ మందిరంలో కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం లక్ష తులసీ దళార్చన పూజలు నిర్వహించారు. మందిరం ప్రధాన అర్చకులు అనంత ఆచార్యుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. - రాయగడ

నాటుసారా బట్టీలు ధ్వంసం



పర్లాకిమిడి: పట్టుబడిన నిందితులు, నాటుసారాతో ఎక్సైజ్ సిబ్బంది

బరంపురం: గంజాం జిల్లాలోని అస్కా పోలీసుస్టేషన్ పరిధిలో నాటుసారా తయారీ, విక్రయాలపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. శుక్రవారం పాకలపల్లి, ఈరగుల్లా గ్రామాల్లో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీలపై అధికారులు దాడులు చేసి 2,000 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. అలాగే 280 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, సంబంధిత 13 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఐఐసీ అధికారి ప్రశాంత్ కుమార్ సాహు తెలియజేశారు. వారి వద్ద నుంచి నాటుసారా తయారీ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

పర్లాకిమిడి: గజపతి జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభాత్ కుమార్ శెఠి అనుమతిలో పర్లాకిమిడి, కాశీనగర్ ఎక్సైజ్ సిబ్బంది ఆంధ్రా– ఒడిశా సరిహద్దు ప్రాంతాలు సిద్ధమణుగు, హడ్డుభంగి, కాశీనగర్ ప్రాంతాల్లో నాటుసారా స్థావరాలపై శుక్రవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో మొత్తం 260 లీటర్ల నాటుసారా పట్టుబడగా, 13 మందిని అరెస్టు చేశారు. నిందితులను జిల్లా కోర్టుకు తరలించినట్లు అబ్కారీ సీనియర్ అధికారి ప్రకాష్ కుమార్ సాహు తెలియజేశారు. దాడుల్లో ఎక్సైజ్, పోలీసు సిబ్బంది కుబేర్ సెఠి, బలరాం ప్రధాన్, భగీరథి జెన్నా, మొజేష్ శోబోరో తదితరులు పాల్గొన్నారు.




బరంపురం: దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

మరింత పెరగనున్న చలి తీవ్రత



భువనేశ్వర్: రానున్న కొద్దిరోజుల్లో రాష్ట్రమంతటా రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రత మరింత గణనీయంగా తగ్గే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. ఈ కార్యాలయం సమాచారం ప్రకారం రాష్ట్రంలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. మిచాంగ్ తుఫాన్ తర్వాత రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అంతేకాకుండా శుక్రవారం రాష్ట్రంలో పలుచోట్ల పొగమంచు కారణంగా దృశ్యమానత తగ్గింది. మయూర్‌భంజ్ జిల్లాలో ఇప్పటికే చలి గాలులు వీస్తున్నాయి. మయూర్‌భంజ్ జిల్లా కరంజియా సబ్ డివిజన్‌లో పలుచోట్ల తేలికపాటి వర్షంతో మేఘావృతమైన వాతావరణం నెలకొని ఉంది. గత 24 గంటల్లో నయాగడ్‌లో అత్యధికంగా గరిష్ట ఉష్ణోగ్రత 29.5 డిగ్రీల సెల్సియస్, అత్యల్పంగా కనిష్ట ఉష్ణోగ్రత సుందర్‌గడ్‌లో 15 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని ఐఎండీ తెలిపింది. ఇదిలా ఉండగా దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాలపై చురుకైన అల్పపీడనం బలహీనపడింది. దీంతో ఒడిశాలోని పలు ప్రాంతాల్లో చలి కొనసాగుతోంది. రాష్ట్రంలో కొన్నిచోట్ల శుక్రవారం నుంచి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కార్యాలయం అంచనా వేసింది.

కేటుగాళ్ల.. ఆటకట్టు



- ఇక మహా నగరం మరింత సేఫ్
- నేర నియంత్రణకు సరికొత్త టెక్నాలజీ
- ప్రతీ స్టేషన్‌లో లైవ్ ఫింగర్ ప్రింట్ స్కానర్లు
- సీసీ టీవీతో అనుసంధానం

భువనేశ్వర్: నగర పరిసర ప్రాంతాల్లో దోపిడీలు, దొంగతనాలు, బెదిరింపులు, మామూళ్ల వసూలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా పండగలు, రద్దీల సమయాల్లో నేరాలు పెచ్చుమీరుతున్నాయి. దీంతో నేర కార్యకలాపాల ఆటకట్టించేందుకు హోం శాఖ చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా నేర నియంత్రణ కోసం టెక్నాలజీని ఉపయోగించుకుంటున్నట్లు నగర డీసీపీ ప్రతీక్ సింగ్ తెలిపారు. ప్రధానంగా జనవరి 1వ తేదీ ఆంగ్ల సంవత్సరాది వేడుకలు పురస్కరించుకుని పొంచి ఉన్న నేరాల నేపథ్యంలో లైవ్ ఫింగర్ ప్రింట్ స్కానర్లను ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ పోలీసుస్టేషన్ అధికారి నుంచి జోన్ ఏసీపీ వరకు అనుక్షణం అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరించారు.

ప్రత్యేక డ్రైవ్

దసరా పండగ హడావుడిలో నగరంలో వరుసగా జరిగిన చోరీ సంఘటనలతో అప్రమత్తమైన కమిషనరేట్ పోలీసులు కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో నేరగాళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. 2023 ముగింపు దశకు చేరుకోగా రాష్ట్ర రాజధాని వాసులు కొత్త సంవత్సరాన్ని ఘనంగా స్వాగతించేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే ఇది పెళ్లిళ్ల సీజన్ కావడంతో మరింత సందడిగా ఉన్న పరిస్థితులు నేరగాళ్లు అనుకూలపరచుకోకుండా జాగ్రత్త వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కమిషనరేట్ పోలీసులు హోటళ్లు, అంతర్ రాష్ట్ర నేరగాళ్లపై నిఘాను దష్టిలో ఉంచుకుని బందోబస్తును పటిష్టం చేసి స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టాలని నిర్ణయించారు.

పటిష్ట నిఘా

బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాలకు చెందిన అనేక మంది నేరస్థులు రాజధాని నగరంలో వివిధ నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించడంతో మెరుగైన పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. నేరస్థులు నేరాలకు పాల్పడే పద్ధతులు, అపార్ట్‌మెంట్లు మరియు ఇతర నివాస ప్రాంతాల్లో భద్రతను ఎలా పటిష్టం చేయాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. గతంలో జరిగిన తీవ్రమైన నేరాలను పరిగణనలోకి తీసుకుని కొత్త సంవత్సర వేడుకలు, వివాహ వేడుకల సమయంలో ఎలాంటి నేరాలు జరుగుతాయో ఊహించి భద్రతను పెంచేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారు. నగరాన్ని మరింత సురక్షితంగా మార్చడమే లక్ష్యంగా అవలంబిస్తున్న కొత్త విధానం గురించి కమిషనరేట్ పోలీసులు అపార్ట్‌మెంట్లతో సహా అనేక ప్రాంతాల్లో అవగాహన డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. నేరపూరిత కార్యకలాపాలకు సంబంధించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు తెలియజేస్తున్నారు.

నేర చరిత్ర బట్టబయలు



వేలిముద్రల పరికరం

ఫోరెన్సిక్స్ విభాగం ఇటీవల లైవ్ ఫింగర్ ప్రింట్ స్కానర్‌ను కొనుగోలు చేసిందని భువనేశ్వర్ డీసీపీ ప్రతీక్ సింగ్ తెలిపారు. పట్టుబడిన నిందితుల నేర పూర్వ చరిత్రలు ఉన్నాయో లేదో నిర్ధారించడంలో ఇది సహాయపడుతుంది. వేలిముద్రలు, కనుగుడ్లు, ముఖం, అరచేయి గుర్తుల ఆధారంగా నేర చరిత్ర పసిగడుతుంది. ఈ అధునాతన విశ్లేషణ పద్ధతిపై అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నగరవ్యాప్తంగా ఏర్పాటై ఉన్న సీసీటీవీ కెమెరాల అనుసంధానంతో నేరస్తుల కదలికని పసిగడతారు. దీని కోసం యూనిఫైడ్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ (యూఐసీసీ) వ్యవస్థ ప్రవేశ పెడుతున్నట్లు వివరించారు. అదనపు డీసీపీ ఆధ్వర్యంలో ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి (ఐఐసీ) హోదా అధికారులు ఈ వ్యవస్థని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి నగరవ్యాప్తంగా నేరస్తుల కదలికపై దృష్టి సారిస్తారు

చేలో నీరు.. రైతుకి కన్నీరు

ఆరుగాలం కష్టపడి పండిచిన రైతుకు ప్రకృతి వైపరీత్యాలు శాపంగా మారుతున్నాయి. ప్రతిఏటా అతివృష్టి లేక అనావృష్టి ఏర్పడుతుండడంతో అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నాడు. ఇటీవల వచ్చిన మిచాంగ్ తుఫాన్ గంజా జిల్లా రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. తుఫాన్ ప్రభావంతో వచ్చిన బలమైన గాలులతో కూడిన వర్షం కారణంగా పంట నేలమట్టమైంది. కొన్నిచోట్ల వరికోతలు పూర్తవ్వడంతో వరిపనలు నీటిలో తడిచిపోయాయి. మరికొన్ని చోట్ల పంటకు తెగుళ్లు సోకడంతో ఈ ఏడాది సైతం నష్టాలు తప్పేలా లేవని అన్నదాత లబోదిబోమంటున్నాడు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు పంటనష్టం అంచనా వేస్తున్నారు. – బరంపురం



తెగుళ్లు సోకిన పంటను చూపిస్తున్న రైతులు



రోంగాయిలొండాలో నేలకొరిగిన పంటను పరిశీలిస్తున్న అధికారులు



హింజలికాట్‌లో నీటిలో కుళ్లిపోయిన వరిపనలు



చికిటిలో తడిచిన వరికుప్ప వద్ద రైతు



కబిసూర్య నగర్‌లో నేలమట్టమైన వరిపంట

క్లుప్తంగా

నలుగురు నిందితులు అరెస్టు



అరెస్టు చేసిన నిందితులతో పోలీసులు

మల్కన్‌గిరి: వేర్వేరు దొంగతనాల కేసుల్లో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ రీగాన్‌కీండో తెలిపిన వివరాల మేరకు.. స్థానిక గ్రంథాలయం ఆవరణలో ఉన్నటువంటి మోటార్ పంపు దొంగతనానికి గురైనట్లు గ్రంథాలయ సిబ్బంది మల్కన్‌గిరి పోలీసుస్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా మల్కన్‌గిరి సమితి నూవగుడ గ్రామంలో సోదాలు నిర్వహించి, మోటార్ పంపును స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ముగ్గురు నిందితులు నూవగుడ గ్రామానికి చెందిన హరి కచీమ్, సమీర్ నాగ్, సోహిల్ గండలుగా గుర్తించారు. అలాగే కరెంటు స్తంభాల దొంగతనం కేసులో సత్తగుడ గ్రామానికి చెందిన నారాయణ పంగిని అరెస్టు చేశారు. ఈ నలుగురిని కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు.

మరమ్మతుల పనులు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న నర్సింగ త్రిపాఠి తదితరులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలోని బండారు ఘరణి శక్తిపీఠం మరమ్మతుల పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మెయిన్ రోడ్డులో నున్న మందిర శిఖరం వద్ద రాజ పురోహితుడు నర్సింగ త్రిపాఠి పూజలు చేశారు. ఇటీవల రాష్ట్ర 5టీ చైర్మన్ కార్తికేయ పాండ్యన్ 5టీ కార్యదర్శిగా ఉన్నప్పుడు నబరంగ్‌పూర్ జిల్లా పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదలవ్వడంతో పనులు మొదలుపెట్టారు. కార్యక్రమంలో రాజ వంశీయుడు ఆశిత్ దేవ్, సాంప్రదాయ పురోహితుడు రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుని తిరువీధి శుక్రవారం వైభవంగా జరిగింది. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతి పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు.

16, 17 తేదీల్లో కళింగాంధ్ర సాహిత్య సమాలోచన

శ్రీకాకుళం కల్చరల్: కళింగాంధ్ర కథ, నవల, కవిత్వం, నాటక రంగాలకు సంబంధించి ఈ నెల 16, 17 తేదీల్లో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో సమాలోచన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ముగింపు రోజున వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార గ్రహీతలకు సత్కారం జరుగుతుందని తెలిపారు. రెండు రోజుల సమావేశాలకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. రచయిత, జర్నలిస్టు నల్లి ధర్మారావు అధ్యక్షన జరిగే ఈ కార్యక్రమానికి కొలకలూరి ఇనాక్, డాక్టర్ ఈమనిరాణిశర్మ ఆత్మీయ అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. రచయిత్రి కేఎస్ మల్లీశ్వరి కథా ప్రక్రియపై సమాజం చర్చలో వాడ్రేవు చిన వీరభద్రుడు, డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్‌లు పాల్గొంటారని చెప్పారు. చీకటి దివాకర్ అధ్యక్షతన నవలలపై జరిగే చర్చకు అట్టాడ అప్పలనాయుడు, సిరంశెట్టి కాంతారావు, దుప్పల రవికుమార్‌లు ఉంటారని తెలిపారు. కవిత్వంపై చర్చకు సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, సుంకరి గోపాలయ్య, గార రంగనాథం, బాల సుధాకర్‌మౌళి పాల్గొంటారని అన్నారు.

కల్తీమద్యం పట్టివేత

పోలాకి: మండలంలోని పిన్నింటిపేట ప్రభుత్వ మద్యం దుకాణంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విజిలెన్స్ నిర్వహించిన దాడిలో కల్తీ మద్యం బయటపడింది. 180ఎంఎల్ పరిమాణం కలిగిన 44 కల్తీ మద్యం బాటిళ్లను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.రాజేష్‌కుమార్ తెలిపారు. దుకాణం బాధ్యులు తమ్మినేని గోవిందరావు, బీద పవన్‌కుమార్, బరాటం ఉదయ్‌శంకర్‌లపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. గత ప్రభుత్వంలో మద్యం దుకాణాలు నడిపిన కొందరు వ్యక్తుల ప్రోద్బలంతోనే ఇక్కడ కల్తీ మద్యం విక్రయిస్తున్నారని స్థానికులు తెలిపారు. దాడిలో ఎస్‌ఐలు శ్రీరామూర్తి, మహేశ్వరరావులతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

బాక్సైట్ తవ్వకాలపై అభ్యంతరం లేదు

- స్పష్టం చేసిన గ్రామస్తులు



ప్రజల డిమాండ్లను వింటున్న కంపెనీ ప్రతినిధులు

రాయగడ: జిల్లాలో కాసీపూర్ సమితిలోని సిజిమాలిలో బాక్సైట్ తవ్వకాలకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని బాధిత గ్రామస్తులు స్పష్టం చేశారు. ఈ మేరకు సుంగేరి పంచాయతీలో శుక్రవారం జరిగిన గ్రామసభలో తమ అంగీకారం తెలియజేశారు. కాసీపూర్ సమితిలోని మలిపాదొరా, డుమురి పాదొరా, కంటామాల్, బండేల్, అలిగున, సగుబారి, పిలాన్‌కొన, కొటిబడి గ్రామాలతో పాటు కలహండి జిల్లాలోని తువామూల్ రాంపూర్ సమితిలో టిజిమాలి, చులాబడి గ్రామాలకు చెందిన ప్రజలు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో తవ్వకాలకు సంబంధించి కొద్ది నెలలుగా నెలకొన్న అనిశ్చితికి తెరపడింది.

వసతులు కల్పించాలి

సిజిమాలి గనుల తవ్వకాల్లో భాగంగా ఇళ్లు, వసతులు కోల్పోయినవారికి అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు షరతును విధించారు. అందుకు కంపెనీ యాజమాన్యం సుముఖత వ్యక్తం చేసింది. ఈ ప్రాంతంలో గనుల తవ్వకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అనుమతితో మైత్రీ ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కొద్ది నెలల క్రితం బాక్సైట్ తవ్వకాలకు సన్నాహాలు చేసింది. అందుకు ప్రభావిత గ్రామాల్లోని బాధితులకు కంపెనీ భరోసా ఇచ్చింది. కానీ కొంతమంది వ్యతిరేకత వ్యక్తం చేయడంతో తవ్వకాలకు అవాంతరాలు ఏర్పడ్డాయి. అనంతరం జిల్లా యంత్రాంగం నిర్వహించిన పబ్లిక్ హియరింగ్ కార్యక్రమంలో బాధిత గ్రామస్తులు తవ్వకాలకు అంగీకరించారు. శుక్రవారం సైతం అదే తరహా గ్రామసభ కూడా విజయవంతమవ్వడంతో కంపెనీ యజమానులు ఊపిరి పీల్చుకున్నారు. గనుల తవ్వకాల వల్ల కొత్త పరిశ్రమలు ఏర్పాటవుతాయని, అదేవిధంగా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు.



పల్లె సభకు హాజరైన గ్రామస్తులు

పరస్పరం సహకరించుకోవాలి



మాట్లాడుతున్న అజయ కుమార్ లెంక

జయపురం: సహకార బ్యాంకులతో వ్యాపారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు పరస్పరం సహకరించుకోవాలని కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ (కేసీసీ బ్యాంక్) కార్యదర్శి అజయ్ కుమార్ లెంక సూచించారు. స్థానిక కేసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయ సభాగృహంలో బ్యాంక్ యాజమాన్యం, జయపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ సమన్వయ సమావేశాన్ని కేసీసీ బ్యాంక్ పరిచాలన కమిటీ అధ్యక్షుడు ఈశ్వర చంద్ర పాణిగ్రాహి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లెంక మట్లాడుతూ.. తమ బ్యాంక్ చిన్న వ్యాపారులకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని తెలియజేశారు. బ్యాంక్ లావాదేవీల్లో వ్యాపారులు మమేకమై లబ్ధి పొందాలని పిలుపునిచ్చారు. రైతులు, వ్యాపారుల సౌకర్యం కోసం వివిధ పథకాలను బ్యాంక్ అమలు చేస్తోందని వివరించారు. ఈశ్వర చంద్ర పాణిగ్రహి మాట్లాడుతూ.. కొరాపుట్, రాయగడ, మల్కన్‌గిరి, నవరంగపూర్ జిల్లాల్లో తమ సహకార బ్యాంక్‌కు 23 బ్రాంచ్‌లు, 7 ఏటీఎం కౌంటర్లు ఉన్నాయని తెలియజేశారు. వాటి ద్వారా లక్షలాది మంది రుణాలు పొందడంతో పాటు బ్యాంక్ సౌకర్యాలు పొందుతున్నారని వివరించారు. సమావేశంలో బ్యాంక్ రుణ విభాగ మేనేజర్ అరుణ కుమార్ సాహు, బ్యాంక్ సీనియర్ అధికారి అతుల్య మల్లిక్, జయపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు వి.ప్రభాకరరావు, కార్యదర్శి డి.మాధవ, ఉపాధ్యక్షులు ఎ.శ్రీనివాసరావు, శ్రవణ కుమార్ డాకా, సంజయ కుమార్ పారిఖ, పి.గౌతమ్, అనిల్ సోని, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

● మర్యాదపూర్వక భేటీ



రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు, 5టీ చైర్మన్ కార్తికేయ పాండ్యన్‌ను అవిభక్త కొరాపుట్ జిల్లాలకు చెందిన రాష్ట్ర స్వతంత్ర మండలి సలహాదారుడు ప్రదీప్ మజ్జి, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రాధానిలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఉద్యోగానికి రాజీనామా చేసి బిజేడీలో చేరిన ఆయనకు అభినందనలు తెలియజేశారు. – కొరాపుట్

క్రీడా పోటీలు ప్రారంభం



రన్నింగ్‌లో పోటీపడుతున్న విద్యార్థులు

జయపురం: స్థానిక సిటీ ఉన్నత పాఠశాలలో తెలుగు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో 42వ వార్షిక క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పాఠశాల పరిచాలన కమిటీ అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు స్థానిక చౌడేశ్వరి ఆలయంలో క్రీడా మసాలను వెలిగించి విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తూ నెహ్రూ నగర్‌లోని పాఠశాల వద్దకు చేరారు. ర్యాలీలో పాఠశాల హెచ్‌ఎం బి.సుజాత, పీఈటీ రీటా సామంత రాయ్, కృష్ణ చంద్రమౌళి, కె.పద్మ, బి.ధర్మారావు, సస్మిత పాత్రో, జయపురం తెలుగు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు బిరేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు 100 మీటర్ల పరుగు పందెం పోటీలు, రిలే, లాంగ్ జంప్, హైజంప్, స్లో సైకిల్ రేస్, స్కిప్పింగ్, కబడ్డీ, డిస్కస్ త్రో పోటీలు జరిగాయి. రెండు రోజుల పాటు జరగనున్న పోటీలు శనివారంతో ముగుస్తాయని ఉపాధ్యాయుడు ప్రతాప్‌కుమార్ పట్నాయిక్ వెల్లడించారు.



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

జాబ్‌మేళాలో 221 మంది ఎంపిక



మెగా జాబ్‌మేళాకు హాజరైన యువత

శ్రీకాకుళం న్యూకాలనీ: స్థానిక మహిళా డిగ్రీ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 221 మంది పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఎంపికైన వారు ఇష్టమైన రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్ పిలుపునిచ్చారు. జాబ్‌మేళాకు జిల్లా నలుమూలల నుంచి 508 మంది హాజరు కాగా 221 మంది ఎంపికయ్యారు. వీరికి అధికారులు నియామక పత్రాలను అందజేశారు. అంతకముందు జరిగిన సమావేశంలో సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంపిక కాని అభ్యర్థులు స్కిల్ హబ్స్ ట్రైనింగ్‌లో చేరి వారి నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు, జిల్లా పర్యాటక అధికారి ఎస్.నారాయణరావు, జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ, ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ కె.వెంకట్ ఉజ్వల్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ స్థానికంగా చేసే ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా ఉద్యోగం ఎక్కడ వచ్చినా సరే అందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు.

కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ వాణికుమారి, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏడీఎస్‌డీఈ బి.చంద్రమౌళి, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఎం.వంశీకృష్ణ, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

లిక్కర్ అక్రమాలతో బీజేడీకి సంబంధాలు

- సీబీఐతో విచారణ జరపాలి
- బీజేపీ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న బీజేపీ అధికార ప్రతినిధి మనోజ్ మహాపాత్రో

భువనేశ్వర్: రాష్ట్రంలో కొనసాగుతున్న ఆదాయపు పన్ను శాఖ దాడుల ప్రభావంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. లిక్కర్ అక్రమార్కులతో అధికార పక్షం బిజూ జనతాదళ్‌కు సంబంధాలు ఉన్నట్లు విపక్ష భారతీయ జనతా పార్టీ ఆరోపణలు చేస్తోంది. మద్యం వ్యాపారులతో అధికార పార్టీకి చెందిన పలువురు నాయకుల మధ్య సంబంధం గుట్టురట్టు చేసేందుకు సీబీఐ విచారణ చేపట్టాలని శుక్రవారం డిమాండ్ చేసింది.

అంత డబ్బు ఎక్కడికి..?

ఈ మేరకు స్థానిక బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ అధికార ప్రతినిధి మనోజ్ మహాపాత్రో మాట్లాడారు. డిస్టిలరీ గ్రూప్ వార్షిక టర్నోవర్ కేవలం రూ.120 కోట్లకు పరిమితమైతే, రూ.500 కోట్లు ఎలా బయటపడ్డాయని ప్రశ్నించారు. ఎన్నికల సంబంధిత ఖర్చుల నిమిత్తం కోట్లాది రూపాయలను బిజూ జనతా దళ్ దాచి ఉంచిందన్నారు. బౌధ్, సోన్‌పూర్, టిట్లాగఢ్, రాయగడ, బర్‌గఢ్‌లోని బీజేడీ మంత్రులు, నాయకులతో సాహు సోదరుల సంబంధాలకు సంబంధించి సమాచారం ఉందన్నారు. రవాణా శాఖ మంత్రి టుకుని సాహు, ఇతర మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు నిందితులతో వేదిక పంచుకున్న ఫొటోలను చూపించారు. ఒడియాయేతర వ్యాపారులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు.

ఇదీ విషయం

ఒడిశాలో జార్ఖండ్ కాంగ్రెస్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు ధీరజ్ సాహుకు చెందిన కార్యాలయాల్లో ఆదాయ పన్ను శాఖ దాడులు చేపట్టింది. ఈ దాడుల్లో ఇప్పటివరకు రూ.200 కోట్ల విలువైన నగదును స్వాధీనపరచుకున్నారు. బౌధ్, రాయిడిహ్ సంబల్‌పూర్, బొలంగీర్ జిల్లాలతో పాటు జార్ఖండ్‌లోని రాంచీ, లోహర్‌దాగాలో ఉన్న బౌద్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్ (బీడీపీఎల్)పై నిర్వహించిన సోదాల్లో దాదాపు రూ.150 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇలా సమగ్రంగా రూ.250 కోట్లు పైబడి పట్టుబడింది. నోట్ల లెక్కింపు కోసం ఆదాయ పన్ను శాఖ మూడు డజన్ల కౌంటింగ్ యంత్రాలను ఉపయోగించింది. బౌద్ జిల్లాలోని హరభంగా మండలం తితిరి కొత వద్ద బీడీపీఎల్ ప్రహరీ గోడకు సమీపంలో శుక్రవారం భారీ మొత్తంలో చిరిగిన రూ.500 కరెన్సీ నోట్లు గుర్తించడం మరింత వివాదస్పదమైంది.

బాల కార్మికులకు విముక్తి

పర్లాకిమిడి: పట్టణంలోని పలు దుకాణాలు, హోటళ్లు, గ్యారేజీల్లో జిల్లా కార్మిక శాఖ అధికారి లోకనాథ పండా, శిశు సంక్షేమ శాఖ, సీసీడీ స్వచ్ఛంద సంస్థ, పోలీసు అధికారుల సాయంతో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా రాజవీధిలోని ఒక ప్రైవేటు రెస్టారెంట్, కొత్త బస్టాండ్ దిలీప్ గ్యారేజీలో పనిచేస్తున్న ఒక బాలుడు, బాలికను అధికారులు పట్టుకున్నారు. వీరిని జిల్లా శిశు సంక్షేమ శాఖకు అప్పగించారు. మైనర్ బాలుడు రాయఘడ బ్లాక్, మైనర్ బాలిక గంజాం జిల్లాకు చెందినవారుగా అధికారులు గుర్తించారు. జిల్లా అధికారులు అన్ని ఆధారాలు సేకరించి జిల్లా యంత్రాంగం ద్వారా నడుస్తున్న ఆర్.సీతాపురం జగన్నాథ నికేతన్, ప్రాధా (బ్రాహ్మణ సీతాపురం) పునరావాస కేంద్రాలకు తరలించనున్నట్లు డీసీపీయూ అరుణ్‌కుమార్ త్రిపాఠి తెలియజేశారు. దాడుల్లో అదనపు శిశు సంక్షేమ సమితి అధికారి మమతా శతపతిపాల్గొన్నారు.



మల్కన్‌గిరి: గ్యారేజీలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితిలో టాస్క్‌ఫోర్స్ బృందాలు శుక్రవారం విస్తృతంగా బాల కార్మికులను గుర్తించేందుకు దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా నలుగురు బాల కార్మికులను పట్టుకొని జిల్లా శిశు సంక్షేమాధికారులకు అప్పగించారు. అయితే వీరి ఎవరు పనిలో పెట్టుకున్నారో వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో జిల్లా అదనపు శ్రమాధికారి పూర్ణిమ దురుకు, జిల్లా శిశు రక్షణ అధికారి శివనాథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: జిల్లా శిశు సంక్షేమ సురక్షా యూనిట్ కార్యాలయానికి తరలించిన బాల కార్మికులు

నమ్మకంగా నామాలు

తీరుమారని గార ఎస్‌బీఐ

- బ్యాంకుని భ్రష్టు పట్టించిన ఇంటి దొంగలు
- ఆడిట్ లోపాలతోనే అక్రమాలు
- అధికారుల పాత్రపై అనుమానాలు
- నిగ్గు తేల్చాల్సిన సమయమిదే



రికవరీ చేసిన బంగారాన్ని చూపిస్తున్న ఎస్పీ రాధిక ఇతర అధికారులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: బ్యాంకుపై జనం పెట్టుకున్న నమ్మకాన్ని ఇంటి దొంగలు నడిబజారులో అమ్మేశారు. తాకట్టు బంగారం మాయమైన గార ఎస్‌బీఐ బ్రాంచ్‌లో గతంలో రూ.15కోట్ల విలువైన నకిలీ రుణాల కుంభకోణం జరిగింది. రైతులు లేకుండానే వారి పేరు మీద అకౌంట్లు సృష్టించి రూ.15కోట్ల విలువైన రుణాలను అప్పటి సిబ్బందిలో కొందరు తమ సొంత ఖాతాలకు మళ్లించుకున్నారు. ఈ కేసులో బ్యాంకు మేనేజర్‌తో సహా నలుగురు సస్పెండ్ కూడా అయ్యారు. ఇప్పుడు రూ.7కోట్ల విలువైన 7కిలోలకు పైగా తాకట్టు బంగారాన్ని పక్కదారి పట్టించారు. ఇందులో కూడా సస్పెన్షన్లు, అరెస్టులు జరిగాయి. మధ్యలో వ్యవసాయ రుణాల పేరిట కమీషన్లు తీసుకోవడం, బీసీ రుణాల పేరిట ముడుపులకు కక్కుర్తి పడిన సందర్భాలూ ఉన్నాయి. మొత్తానికి గార ఎస్‌బీఐకు అక్రమాలు కొత్తేమీ కాదన్నట్లు వరుస సంఘటనలు జరుగుతున్నాయి. ఇప్పుడక్కడ బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. బ్యాంకు అధికారులతో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణ డొల్లతనం కనిపిస్తోంది.

గత ఏడాది నుంచే..

గత సంఘటనలు పక్కన పెడితే పోలీసు అధికారుల విచారణ ప్రకారం 2022 సెప్టెంబర్ నుంచి ఇక్కడ తాకట్టు బంగారం బయటికెళ్లినట్టు తేలింది. అంటే దాదాపు 14 నెలలుగా ఖాతాదారుల తాకట్టు బంగారం పక్కదారి పడుతోంది. ఇంత జరుగుతున్నా బ్యాంకు ఉన్నతాధికారులు కనిపెట్టలేక పోవడం ఆశ్చర్యకరమే. అసలు బ్యాంకులో ఉన్న బంగారం బయటకు రావడమే తప్పు. దానికి తోడు ఆ బంగారాన్ని మారు తాకట్టు పెట్టడం మరింత నేరం. కానీ బ్యాంకు ఉద్యోగులు మాత్రం ఖాతాదారుల నమ్మకాన్ని వమ్ము చేశారు. బ్యాంకులపై నమ్మకంతో ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారాన్ని బయటకు పంపిస్తే తిరిగి అవి ఎంత భద్రంగా వస్తాయన్నది అనుమానమే. మొత్తానికి పక్కదారి పట్టిన బంగారం ఎట్టకేలకు పోలీసుల విచారణతో రికవరీ అయింది. అందులో ప్రమేయం ఉన్న ఏడుగురిని అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నారు. అసలు సిసలు దర్యాప్తు ఇప్పుడే మొదలైంది.

అధికారుల పాత్ర ఉందా..?

గార ఎస్‌బీఐలో 7కిలోలకు పైగా బంగారం మిస్సింగ్ వెనక స్థానిక బ్రాంచి ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులే కాదు సంబంధిత అధికారుల పాత్ర కూడా ఉండవచ్చని అంటున్నారు.

- సాధారణంగా బ్రాంచి స్ట్రాంగ్ రూమ్‌ల్లోని సెల్ఫ్‌ల్లో ఉన్న తాకట్టు బంగారంపై ఎప్పటికప్పుడు పరిశీలన, ఆడిట్ జరగాలి. నెలకొకసారి తాకట్టు బంగారాన్ని పరిశీలించాలి.
- మూడు నెలలకొకసారి ఆడిట్ చేయాలి. ఇదంతా బ్యాంకు ఉన్నతాధికారుల బాధ్యత.
- ఇక్కడ 14 నెలలుగా బ్యాంకు నుంచి తాకట్టు బంగారం పోతుంటే పరిశీలన, ఆడిట్ ఏ రకంగా చేసినట్లో సంబంధిత అధికారులే చెప్పాలి.
- ఇందులో ఎవరి పాత్ర ఏంటో, ఎవరికెంత వాటానో, ఎంతమేరకు చేతులు మారిందో తేలాల్సి ఉంది.
- పోలీసు అధికారులతో పాటు బ్యాంకు యాజమాన్యం కూడా అసలు మూలాలను గుర్తించాలి. లేదంటే కీలక వ్యక్తులను విస్మరించినట్టు అవుతుంది.
- స్ట్రాంగ్ రూమ్‌ల్లోని సెల్ఫ్‌లకు సంబంధించి కస్టోడియన్‌లుగా ఇద్దరు వ్యక్తుల వద్ద వేర్వేరు తాళాలు ఉంటాయి.
- ఆ ఇద్దరు కలిసి తెరిస్తే తప్ప సెల్ఫ్‌ల నుంచి బంగారం బయటికి రాదు.
- ఇక్కడ ఏడాదికి పైగా తాకట్టు బంగారం పక్కదారి పడుతుందంటే కుమ్మక్కై కుట్ర పూరితంగా అక్రమాలకు పాల్పడుతున్నట్టు స్పష్టమవుతోంది.

12న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ నూతన కార్యవర్గ ఎన్నిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో కొనసాగుతున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌గా ఉన్న అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలను ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్టు డీఈఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్ నడుపుతున్న పాఠశాలల ఉపాధ్యాయులు, కెప్టెన్లు 12న ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ రోడ్‌లో ఉన్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయానికి హాజరు కావాలని ఆయన సూచించారు.

కృష్ణప్రసాద్‌కు ఉత్తమ రైతు అవార్డు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి సేద్యం చేస్తున్న కొంగరాంకు చెందిన గోపిన కృష్ణప్రసాద్ న్యూఢిల్లీలో భారత వ్యవసాయ మండలి నిర్వహించిన కృషిజాగరన్ మేళాలో ఉత్తమ రైతు అవార్డును శుక్రవారం అందుకున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల నివేదిక ఆధారంగా ఆయనకు ఈ అవార్డు లభించింది. గత 15 ఏళ్లుగా ఆయన కొంగరాంలో ప్రకృతి, సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. పూల తోటలు, కర్బూజా, వరి, తృణ ధాన్యాలు వంటివి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సైతం నాలుగు ఎకరాల్లో సాంబ మసూరి రకాన్ని ప్రకృతి వ్యవసాయ పద్ధతిలోనే సాగు చేశారు. ఢిల్లీలో మిలీనియం ఫార్మర్స్ మీట్–2023ను ఈ నెల 6వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ఉత్తమ రైతు అవార్డును స్వీకరించారు.



ఉత్తమ రైతు అవార్డు స్వీకరిస్తున్న కృష్ణప్రసాద్

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


అశోక్‌వర్ధన్ మృతదేహం

గంట్యాడ: మండల కేంద్రానికి చెందిన సిడగం అశోక్‌వర్ధన్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఇంట్లో లేని సమయంలో శుక్రవారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. సాయంత్రం కుటుంబసభ్యులు ఇంటికి వచ్చిన తరువాత ఫ్యాన్‌కు వేలాడుతున్న అశోక్‌వర్ధన్‌ను చూసి పోలీసులకు సమాచారం అందజేయగా పోలీసులు వచ్చి పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు. అయితే యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

విజయనగరం క్రైమ్: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మెసానిక్‌టెంపుల్ బయట గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శుక్రవారం తెలిపారు. ఫోన్ ద్వారా వచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామని, మృతుడి వయసు సుమారు 60 నుంచి 75 ఏళ్లు ఉండవచ్చని సీఐ చెప్పారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని, సంబంధీకులెవరైనా గుర్తిస్తే తమను సంప్రదించాలని కోరారు.

భర్త అదృశ్యం

విజయనగరం క్రైమ్: నిత్యం తప్పతాగి ఇంటికి వస్తున్నాడని భార్య మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిన భర్త తిరిగి రాకపోవడంతో చేసేది లేక ఆమె టూటౌన్‌పోలీసులకు శుక్రవారం ఫిర్యాదుచేసింది. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక అయ్యకోనేరు దక్షిణగట్టు వద్ద నివాసం ఉంటున్న మామిడి బంగారయ్య రిక్షా కార్మికుడు. నిత్యం తప్పతాగి ఇంటికి రావడంతో కుటుంబసమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని భార్య లక్ష్మి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన బంగారయ్య నవంబరు 17న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆమె టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 7780422640ను సంప్రదించాలని కుటుంబసభ్యులు కోరారు.

పోలీసుల సంక్షేమానికి కృషి


సీహెచ్.వెంకటరావుకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుల సంక్షేమానికి తామెప్పుడూ పూర్తి స్థాయిలో కృషిచేస్తున్నామని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. చేయూతలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన సీహెచ్.వెంకటరావుకు హోంగార్డుల ఒక్కరోజు జీతం చేయూత కింద సేకరించిన రూ. 3 లక్షల 50 వేల 30 రూపాయల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆర్ అడ్మిన్ టి.శ్రీనివాసరావు, కార్యాలయ పర్యవేక్షకుడు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

11న సర్టిఫికెట్ల పరిశీలన

విజయనగరం అర్బన్: జిల్లా పౌరసరఫరాల సంస్థలో కాంట్రాక్ట్ పద్ధతిలో అకౌండెంట్ గ్రేడ్ -3 పోస్టులకు నియామకం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలన కోసం డిసెంబరు 11న హాజరు కావర్చని సంస్థ జిల్లా మేనేజర్ మీనాకుమారి తెలిపారు. తుఫాన్ కారణంగా ఈ నెల 8వ తేదీన ఈ అభ్యర్థులకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలియజేశామని, అయితే 11వ తేదీన హాజరయ్యేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కూడా అదేరోజు జరుగుతుందని పేర్కొన్నారు.

అంతర్గత చర్యలకు సిఫారసు

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్ఏయూలో ఈ నెల 5న జరిగిన విద్యార్థుల ఘర్షణకు సంబంధించి వీసీ నియమించిన కమిటీ నివేదికను అందజేసింది. వర్సిటీ స్టాండింగ్ కమిటీ సభ్యులతో పాటు, వర్సిటీ అధికారులతో కూడిన 12 మంది సభ్యుల బృందం పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించింది. ఇంజినీరింగ్ విద్యార్థులు జన్మదిన వేడుకలు నిర్వహించడం, బాణసంచా కాల్చడంతో పీజీ విద్యార్థులు అడ్డు చెప్పడంతో ఘర్షణ జరిగినట్లు వారు పేర్కొన్నారు. ఘర్షణకు పాల్పడిన వారి పేర్లను కూడా వీసీకి అందజేశారు. దీనిపై రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు బాధ్యత తెలియాలంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

మా సొమ్ము ఏమైందో..!

నీలగిరి తోటలు, పెద్ద పెద్ద చెట్లు ఉండడంతో ఆ ప్రదేశం నిర్మానుష్యంగా ఉంటుంది. ఆ ప్రదేశానికి సుమారు వంద మీటర్ల వరకు ఎటువంటి నివాసాలు లేవు. అదే ప్రదేశంలో స్టేట్ బ్యాంక్ బ్రాంచిని ఏర్పాటు చేశారు. ఈ బ్యాంకులో సులువుగా దొంగతనం చేసేందుకు దుండగులకు వీలుంటుంది. ఈ బ్యాంకులో గల ఏటీఎంలో గతంలో దొంగలు గ్యాస్ కట్టర్‌లతో కట్‌చేసి చెల్లాచెదురు చేసిన ఘటనలు ఉన్నాయి. ఈ బ్యాంక్‌కు రాత్రి కాపలాదారు లేకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా గురువారం రాత్రి ఈ బ్రాంచిలో చోరీకి దుండగులు విఫల యత్నం చేయడంతో ఖాతాదారులు అంతా కలిసి బ్రాంచ్ మేనేజర్‌పై విరుచుకుపడ్డారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి.

– కొత్తవలస


నిర్మానుష్య ప్రాంతంలో స్టేట్ బ్యాంకు భవనం

- ఎస్‌బీఐ ఖాతాదారుల ఆందోళన
- ఎస్‌బీఐలో చోరీకి దుండగుల విఫలయత్నం
- పోలీసుల రాకతో దొంగల పరారీ
- బ్రాంచ్ మేనేజర్‌పై కస్టమర్ల ఆగ్రహం


బ్యాంకు కిటికీ ఊచలను కట్‌చేసి లోనికి ప్రవేశించిన మార్గం

కొత్తవలస మండలంలోని చింతలపాలెం గ్రామం సమీపంలో గల స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో గురువారం రాత్రి దొంగలు చోరీకి విఫల యత్నం చేశారు. ఎప్పటిలాగానే బ్యాంకులో లావాదేవీలు పూర్తయిన తరువాత తాళాలు వేసుకుని సిబ్బంది సాయంత్రం వెళ్లిపోయారు. అయితే రాత్రి 11 గంటలు దాటిన తరువాత బ్యాంకు భవనానికి ఉత్తరం వైపు గల కిటికీ ఊచలను గ్యాస్ కట్టర్‌తో తొలిగించి బ్యాంకులోపల గల స్ట్రాంగ్ రూమ్‌లోకి దుండగులు ప్రవేశించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లాకర్‌లను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి ఓపెన్ చేశారు. అయితే అందులో కేవలం దస్త్రాలు మాత్రమే ఉన్నాయి. గ్యాస్‌కట్టర్‌తో కట్ చేసిన సమయంలో కొన్ని దస్త్రాలు కూడా కాలిపోయాయి. దీంతో పక్కనే గల మరో లాకర్‌ను ఓపెన్ చేయకుండా బ్యాంకు గదిని ఆనుకుని ఉన్న ఏటీఎంలోకి చొరబడి గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను పూర్తిగా కాల్చి ఓపెన్ చేశారు. ఆ సమయంలో ఇక్కడి ఏటీఎంకు ముంబైలోని ప్రధాన కార్యాలయానికి అనుసంధానం చేసిన అలారం మోగడంతో అక్కడి సిబ్బంది అలెర్ట్ అయి బ్యాంకు మేనేజర్ ఓ.వి.చంద్రశేఖర్‌ను ఫోన్‌లో అప్రమత్తం చేశారు. దీంతో ఆయన వెంటనే స్థానిక ఎస్సైకి విషయం చేరవేయగానే రాత్రి గస్తీ పోలీసులు హుటాహుటిన బ్యాంకు వద్దకు చేరుకోగా గమనించిన దుండగులు జారుకున్నారు. పోలీసులు రావడం ఏమాత్రం ఆలస్యమైనా ఏటీఎంలో గల సుమారు రూ.20లక్షలు దొంగల పాలయ్యేవని బ్యాంకు మేనేజర్ తెలిపారు. బ్యాంకులోకి ప్రవేశించిన దొంగలు కొన్ని బీరువాలకు గల తాళాలను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి చెంతనే గల తుప్పల్లో పారేశారు. అలాగే బ్యాంకులో గల కొన్ని కంప్యూటర్లను ధ్వంసం చేశారు. సీసీ కెమెరాలను విరగ్గొట్టి రికార్డింగ్ ఆయ్యే డీవీఆర్‌ను తమతో తీసుకుపోయారు.

చోరీ జరగలేదు

దొంగలు అధునాతన పరిజ్ఞానంతో చోరీకి పాల్పడి విఫలమయ్యారని బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. బ్యాంకులో కొన్ని దస్త్రాలు కాలిపోయాయి తప్పితే ఒక్క రూపాయి కూడా చోరీకి గురికాలేదని స్పష్టం చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న ఖాతాదారులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం మేరకు విజయనగరం నుంచి ప్రత్యేక క్లూస్ టీమ్ వచ్చి బ్యాంకులోను, ఏటీఎంలో వేలి ముద్రలను సేకరించింది. కొత్తవలస సీఐ ఎస్.చంద్రశేఖర్ సిబ్బందితో వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బ్యాంకు మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


బ్యాంకులో వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్‌టీమ్


బ్యాంకు మేనేజర్‌ను నిలదీస్తున్న ఖాతాదారులు

పోక్సో కేసులో ముద్దాయికి 20ఏళ్ల జైలు


ముద్దాయి గుమ్మిడి ఆదినారాయణ

విజయనగరం క్రైమ్: పోక్సో కేసులో విచారణ అనంతరం ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.రెండువేలు జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం తీర్పు విధించిందని ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. గుర్ల మండలంలోని గరికివలస గ్రామానికి చెందిన గుమ్మిడి ఆదినారాయణ ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దిశ మహిళా పోలీస్‌స్టేషన్‌లో 2023 ఫిబ్రవరిలో పోక్సో చట్టం ప్రకారం ఎస్సై ఎస్.పద్మావతి కేసు నమోదుచేశారు. అప్పటి దిశ మహిళా డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు దర్యాప్తు చేపట్టి, నిందితుడ్ని అరెస్టుచేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. ఈ కేసును ప్రాధాన్యత జాబితాలో చేర్చి, తొమ్మిది నెలల్లోనే ప్రాసిక్యూషన్ పూర్తయ్యేలా చర్యలు చేపట్టగా విచారణలో నేరం రుజువు కావడంతో ఆదినారాయణను ముద్దాయిగా నిర్ధారించారు. ఈ మేరకు స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి ముద్దాయికి 20 ఏళ్లు కఠిన కారాగారం, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. పోలీసుల తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించగా, దిశ మహిళా పోలీస్‌స్టేషన్ ప్రస్తుత డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు , ఇన్‌స్పెక్టర్ బి.నాగేశ్వరరావు పర్యవేక్షణలో కోర్టు హెడ్ కానిస్టేబుల్ బి.దివ్యజ్యోతి, సీఎంఎస్ హెచ్‌సీ రామకృష్ణ సాక్షులను కోర్టులో హాజరుపరిచారు.

'తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తున్నాం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: 'మిచాంగ్' తుఫాన్ వల్ల జిల్లాలో తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అలాంటి ధాన్యం రైతుల వద్ద ఉంటే సంబంధిత రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల జిల్లా మేనేజర్ కె.శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తడిసిన ధాన్యం తేమ శాతం పరీక్షించి తేమ ఎక్కువగా ఉన్నా కూడా కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత


పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో శుక్రవారం ఆర్మ్‌డ్ పోలీసుల ప్రత్యేక పరేడ్ నిర్వహించారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి, అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడారు. పోలీసులు శారీరక, మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలని సూచించారు. అనవసర ఒత్తిడులకు గురి కాకూడదని అన్నారు. ఆరోగ్య పరీక్షల కోసం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు, పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు ప్రసాద్, శ్రీనివాసన్, ఆర్ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నాడు నిస్సహాయులు.. నేడు విజేతలు

- చదువుతో పాటు ఆటల్లో రాణిస్తున్న అనురాగ నిలయం చిన్నారులు
- అనాథాశ్రమంలో చక్కటి ఆదరణ


అనురాగనిలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: అక్కడ చేరే ముందు వారంతా నిస్సహాయులు. ఆప్తులు లేక, ఆస్తులు లేక అభాగ్యులుగా మిగిలిపోయిన వారు. ఎవరి పంచన ఉండాలో తెలీక, ఎవరి మీద ఆధారపడాలో అర్థం కాక కన్నీటితో కడుపు నింపుకున్నారు వారు. కానీ ఆ ఆశ్రమం వారి నుదుటి రాతను అందంగా మార్చింది. జిల్లా కేంద్రంలో రెడ్‌క్రాస్‌కు అనుబంధంగా మగటపల్లి రమణమూర్తి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనురాగ నిలయంలో చదువుకుంటున్న చిన్నారులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఇక్కడ 36 మంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు ఉన్నారు. 18 మంది మగపిల్లలు కాగా 18 మంది ఆడపిల్లలు ఉన్నారు. వీరికి వేర్వేరుగా హాస్టళ్లు ఉన్నాయి. వీరంతా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా చాలా చోట్ల నుంచి ఇక్కడకు వచ్చారు.


నిత్యం కార్యక్రమం

ఇక్కడ పిల్లలు రోజూ 5 గంటలకు లేచి 6 వరకు స్టడీ అవర్స్‌లో ఉంటారు. 6 నుంచి 7.30 గంటల వరకు స్నానాధికాలు చేస్తారు. 7.30 నుంచి 8.45 వరకు టిఫిన్స్ చేస్తారు. అనంతరం ఎవరి స్కూళ్లకు వారు వెళతారు. వారితో పాటుగా మధ్యాహ్నం భోజన కేరేజీలను తీసుకుని వెళతారు. సాయంత్రం 4.15కు మళ్లీ తిరిగి వస్తారు. తర్వాత కొంత మంది దగ్గరలో ఉన్న మైదానానికి ఆటలు ఆడేందుకు వెళ్తారు. 6 నుంచి 8.30 గంటలకు మళ్లీ స్టడీ అవర్స్ ఉంటాయి. వీరికి సాయంత్రం సమయంలో ట్యూషన్ ఉంటుంది. ప్రత్యేకంగా హిందీ కోసం ట్యూటర్ వస్తారు. మగపిల్లలకు, ఆడపిల్లలకు వేర్వేరుగా ట్యూటర్ ఉన్నారు. ఇక్కడ చదువుతో పాటు పిల్లల అభిరుచులకు అనుగుణంగా మృదంగం, సంగీతం, క్రీడలు, యోగా, కరాటే కూడా నేర్పిస్తున్నారు. వారిలో భక్తి ప్రపత్తులు పెరిగేలా విష్ణు సహస్రనామ పారాయణ, లలితా సహస్రనామ పారాయణ, భగవద్గీత పారాయణ, హనుమాన్‌చాలిసా, దేశభక్తి గీతాలు నిర్వహిస్తారు. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయడానికి ఒక డాక్టర్, నర్సు కూడా ఉన్నారు. ఈ ఆశ్రమం నిర్వహణకు దాదాపు నెలకు రూ.2 లక్షల వరకు ఖర్చవుతుంది. దాతల సహకారంతో పాటు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉన్న మూలనిధిపై వస్తున్న వడ్డీలతో నిర్వహిస్తున్నారు.

విజయాలివే..

- ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 14 ఫుట్‌బాల్ పోటీల్లో చరణ్ అనే విద్యార్థి అద్భుతంగా రాణించాడు.
- రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో, స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో నగేష్ పాల్గొన్నాడు.
- కూచిపూడి నృత్య విభాగంలో నృత్య దర్శకులు మెహర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో సుధారాణి, దుర్గ, భవానీ, పావని, నవ్య, యామినిలు ప్రదర్శన కోసం తిరుపతి, హైదరాబాద్‌లలో ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి ఎదిగారు.
- సుధారాణి అనే విద్యార్థిని హిందీలో ప్రవీణ ఉత్తరార్థ పాసైంది. మిగిలిన వారు ప్రాథమిక, మాధ్యమికలో ఉత్తీర్ణులయ్యారు.


పాలి వెళ్లాను



నేను, నా చెల్లి ఇక్కడే చదువుతున్నాం. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరి జైపూర్ రాష్ట్రంలోని పాలి గ్రామానికి టూర్ వెళ్లాను. అలాగే యోగాలో కూడా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను.

– జి.నగేష్, 10వ తరగతి, అనురాగనిలయం


హిందీ టీచర్ అర్హత సాధించా



నేను 2015లో ఇక్కడకు వచ్చాను. ప్రస్తుతం బీసీఏ చదువుతున్నాను. అలాగే హిందీ ప్రవీణలో ఉత్తరార్థ పాసైయ్యాను. పదోతరగతిలో 10/10 వచ్చింది.

– సుధారాణి, బీసీఏ విద్యార్థిని

గోల్ కీపర్‌గా ఎంపికయ్యాను..



నేను విశాఖపట్నంలో మా బంధువుల ఇంటిలో ఉండేవాడిని. నన్ను వాళ్లు బయటకు పంపించేయడంతో ఇక్కడ 6వ తరగతిలో చేర్చారు. అప్పటి నుంచి చదువుతున్నాను. ప్రస్తుతం తొమ్మిదో తరగతికి వచ్చాను. జోనల్ స్థాయిలో గోల్‌కీపర్‌గా రెండో స్థానం సాధించాను. త్వరలో కడపలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను.

– చరణ్, అనురాగనిలయం విద్యార్థి

వైభవంగా సహస్ర దీపాలంకరణ


దీపారాధన వేదికపై ఊయలలో శ్రీ సీతారామ చంద్రస్వామి

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం రాత్రి కనులపండువగా జరిపించారు. వెండి మంటపంలో ఉన్న శ్రీ సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణ నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మంటపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో వేంచేపుజేశారు. అనంతరం దీపాలను వెలిగించి, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర దీపాల శోభలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి జేఎన్‌టీయూ జీవీలో 'ఫాకల్టీ శిక్షణ'


పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ అండ్ కన్సారియమ్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (సీటీఈ) అండ్ ఏపీఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ (ఏపీఐటీఏ) సంయుక్త నిర్వహణలో ఈనెల 18 నుంచి స్థానిక జేఎన్‌టీయూ జీవీ ప్రాంగణంలో ఐదు రోజుల పాటు ఫాకల్టీ కోసం ఐదు రోజుల పాటు ఉచిత అంతర్జాతీయ స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ప్రచార పోస్టర్, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. శిక్షణలో పాల్గొనడానికి నమోదు చేసుకోవాల్సిన ఆన్‌లైన్ లింక్ వివరాలను విడుదల చేశారు. ఈ నెల 10వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు విండోస్ 10 లేదా 11 వెర్షన్ కలిగిన ల్యాప్‌టాప్స్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ఆడిట్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు, శిక్షణ కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ పి.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఈవీఎంపై అవగాహన కేంద్రం


అవగాహన కేంద్రాన్ని ప్రారంభించిన డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత

విజయనగరం అర్బన్: ఓటు హక్కు వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ ప్రాంగణంలో 'ఈవీఎంపై ఓటర్లకు అవగాహన కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈవీఎం వినియోగంపై అపోహలు పోగొట్టడానికి బహిరంగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కలెక్టరేట్‌కు వచ్చి పోయే ప్రజలు నిత్యం ఉంటారని ఈవీఎంపై సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో ఈ అవగాహన కేంద్రం మూడు నెలల పాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో చోరీ


రామారావు ఇంట్లో చోరీ జరిగిన గదులను పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

రాజాం సిటీ: స్థానిక గాంధీనగర్‌లో ఉంటున్న విశ్రాంత ఎస్‌సీసీ అధికారి ఆకిరి రామారావు ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఈ చోరీ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆకిరి రామారావు కుటుంబంతో కలిసి బెంగళూరులోని తన కుమారుడి వద్దకు పదిరోజుల క్రితం వెళ్లారు. ఇది గమనించిన దొంగలు గురువారం రాత్రి ఇంటి మెయిన్ గేటు తాళం పగలగొట్టి లోనికి చొరబడ్డారు. ఉదయం చుట్టుపక్కలవారు గుర్తించి రామారావుకు సమాచారం ఇవ్వడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం మేరకు రాజాం టౌన్ సీఐ రవికుమార్, ఎస్సై రవికిరణ్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరాతీశారు. రామారావుకు ఫోన్ చేసి పలు విషయాలు సేకరించడంతో పాటు రాజాం చుట్టు పక్కల ఉంటున్న రామారావు బంధువులను చోరీ జరిగిన ఇంటి వద్దకు రప్పించారు. ఇంట్లోకి వెళ్లి చోరీ జరిగిన ప్రాంతాలను గుర్తించారు. ఇంట్లోని అన్ని గదుల్లో బీరువాలు పగలగొట్టి ఉండడం, బెడ్‌రూమ్‌ల్లో అన్ని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడాన్ని గమనించారు. నగదు, బంగారు ఆభరణాలు వంటివి ఎంతమేర అపహరణకు గురయ్యాయన్నది తెలియరావడంలేదు. మరోవైపు బెంగుళూరులోని బాధితులు ఇక్కడికి వచ్చేందుకు బయలుదేరారు. సీసీ కెమెరాలు, ఫుటేజీలు, డీవీఆర్ సిస్టమ్ కూడా చోరీకి గురికావడంతో ఇది ఘరానా దొంగలపనేనని పోలీసులు భావిస్తున్నారు. క్లూస్ టీం రంగంలోకి దిగి వివరాలు సేకరిస్తోంది. టౌన్ సీఐ రవికుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఇంట్లో..

ఇదిలా ఉండగా పట్టణంలోని బాబానగర్ 4వ లైన్‌లో తిరిసెట్టి ప్రవీణ్ ఇంట్లో కూడా గురువారం రాత్రి చోరీ జరిగినట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. ప్రవీణ్ కుటుంబం రెండునెలలుగా ఇక్కడ ఉండడం లేదని, ఇంటి తలుపులకు తాళాలు వేసి ఉండేవని, శుక్రవారం తాళాలు పగలగొట్టి ఉండడంతో ఆ ఇంట్లో కూడా చోరీ జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఈ విషయంపై రాజాం పట్టణ సీఐ రవికుమార్ మాట్లాడుతూ ప్రవీణ్ ఇంట్లో చోరీపై ఎటువంటి సమాచారం లేదన్నారు. ఇంటిని పరిశీలించి ఆరాతీస్తామని చెప్పారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనకే జాబ్‌మేళా


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకే ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళాలు నిర్వహించనున్నట్లు పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో ఈనెల 15న నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి యు.సాయికుమార్ మాట్లాడుతూ ఈ మేళాకు 16 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. పదోతరగతి నుంచి బీటెక్, ఎంఎస్‌సీ చదివిన అభ్యర్థులు స్కిల్ యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 6305110947,6303493720 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాయత్రి కళాశాల కరెస్పాండెంట్ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

టెక్కలి రూరల్: టెక్కలి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెండి సాయియశ్వంత్ (23) మృతి చెందాడు. టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. సాయియశ్వంత్ తన బైక్‌పై జాతీయ రహదారి నుంచి టెక్కలి వైపుగా వస్తున్నాడు. అతని వాహనానికి ముందుగా వెళ్తున్న ఆటో డిగ్రీ కళాశాల సమీపంలో యూ టర్న్ తిరుగుతుండగా వెనుక నుంచి వచ్చిన సాయియశ్వంత్ ఒక్కసారిగా ఆటోను ఢీకొట్టి కిందకు పడిపోయాడు. సరిగ్గా అదే సమయంలో ఆ దారిలో వచ్చిన ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ బస్సు యువకుడిపై నుంచి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేస్తుండగా అతను మృతి చెందాడు. దీనిపై మృతుడి తల్లి ఉమామహేశ్వరికి సమాచారం అందించగా.. ఆమె కుమారుడి మృతదేహాన్ని చూసి గుండెలు పగిలేలా రోదించారు. ఆమె కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తుంటారు. యువకుడు మర్చంట్ నేవీలో పనిచేస్తుంటాడు. ఇటీవలే సెలవులపై వచ్చాడు.

ప్రమాదానికి కారణమైన బస్సును అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.